

# అతనూ మనిషే!

మైనంపాటి భాస్కర్

ఇసుక ఎడారి మధ్యలో ఆనకట్ట కడతానన్నవాణ్ణి జనం ఎలా వెర్రివాడి కింద జమకడతారో, అలాగే జమకట్టారు మిత్రులు - వెంకటేశ్వర్లు గుడికడతానన్నప్పుడు. 'ఈ ఊరిని ఆ భగవంతుడు కూడా రక్షించలేడు, అంత పాప పంకిలమైపోయింది!' అని నవ్వారు

అయినా వెంకటేశ్వర్లు వెనక్కి తగ్గలేదు. "నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు! నా ఇచ్ఛయేగాక నాకేటి వెరపు!" అని కృష్ణశాస్త్రిగారి గేయాన్ని వల్లించాడు.

అదే అతనిలో లోపం!

అతనికి గేయాలంటే ఇష్టం! కష్టాలన్నా, మనసుకి తగిలే గాయాలన్నా భయం! పిల్లల దగ్గరనుంచీ పిల్లుల దాకా సమస్త చరాచర జీవులమీదా అతనికి అభిమానం ఉంది.

'ఉత్తి సత్తెకాలపు వాడు' అని చిరకాలం క్రితమే తీర్మానించారు ఆ ఊరి ప్రజ.

కానీ వెంకటేశ్వర్లు దగ్గర బొప్పెంత డబ్బుంది. అందుకని పబ్లిగ్గా అతన్నేమీ అనడానికి ఎవరికీ దమ్ముల్లేవు.

గుడి కట్టడానికి ఉత్తమోత్తమమని విజ్ఞులు నిర్ణయించిన బంజరుభూమిలో ఒక గుడిసె తగలడింది. అందులో తన పిల్లామేకతో కాపురముంటున్నాడు చంద్రిగాడు. ఆ గుడిసె చుట్టూతా సునుపు తేలిన నల్లటి బండలు చాలా ఉన్నాయి. ఆ బండల్లో బండలాగా ఉంటాడు చంద్రిగాడు.

అక్కడ గుడి లేవాలంటే ముందు ఆ గుడిసె 'లేవాలి'!

"నువ్వు నష్టపోవద్దు! దీనికి బదులుగా నీకు ఒక ఎకరం పొలం ఇస్తాను. ఈ స్థలం మాత్రం దేవుడికిచ్చెయ్!" అని అడిగాడు వెంకటేశ్వర్లు, చంద్రిగాడిని పిలిపించి.

ఈ విషయం తెలియగానే కెవ్వుమని కేకేసి మూర్ఛపోయినంత పనిచేశారు ఊరి ప్రజ. 'ఏమిటీ! హరిజనుడికి సుక్షేత్రంలాంటి ఎకరం పొలం పందారం చేసెయ్యడమా? ఇలా చేస్తే వెధవలు నెత్తికెక్కిపోరూ? ఈ వెంకటేశ్వర్లుకి మరీ వళ్ళూపై తెలియకుండా ఉంది.

ఎకరాలంటే మరమరాలనుకుంటున్నా దేమిటీ?" అని చెవులు కొరుక్కున్నారు.

త్వరలోనే గుడిసె నేలమట్టం అయింది.

మట్టసంగా లేస్తోంది గుడి.

శంఖుస్థాపన రోజున, వెంకటేశ్వర్లు గొప్పదాత అనీ, పుణ్యపురుషుడనీ, కారణ జన్ముడనీ ఆనవాయితీగా పొగిడారు పెద్దలు.

వెంకటేశ్వర్లు చంద్రిగాడికిచ్చిన ఎకరంలో వేరుసెనగ పంట ఉంది. అట్టడుగు పొరల్లో కాచినా, తన విలువ తనకున్న పంట అది.

భూమికి స్వంతదారుడైన తర్వాత కూడా, భూమి వదిలి ఆకాశంలో నడవ లేదు చంద్రిగాడు. భార్య పొలం పనులు చూసుకుంటూ ఉంటే, అతను మాత్రం యథావిధిగా కూలీపనులకి హాజరవుతూనే ఉన్నాడు. గుడి మొదలెట్టినప్పటినుంచీ అతనికి రెండు చేతులా పని దొరుకుతూనే ఉంది. ఇటుకలు మొయ్యడానికి రోజుకి రూపాయి ముప్పావలా చొప్పున "తెగ సంపాదించేస్తున్నాడు" అతనికి మామూలుగా రోజు కూలీ రెండు రూపాయలు అయినా. "దేముడి కార్యంరా ఛండాలుడా! దీనికీ ముద్దకుడుముల్లాగా రోజూ రెండ్రూపాయలు కావాలంటే ఎట్లా? ఓ పావలా తగ్గించుకో!" అని పూనుకుని కూలి రేటు తగ్గించారు మధ్య మనుషులు- అసలువాడు వెంకటేశ్వర్లు పట్టించుకోకపోయినా

కొండంత బతుకు భారాన్ని మోసే చంద్రిగాడికి ఇటుకలు మొయ్యడం ఓ లెఖ్ఖలోనిది కాదు. చలాగ్గా తట్టలు మోసేస్తూ ఉండేవాడు.

దేముడి విగ్రహం చెక్కడంకోసం మంచి నల్లరాయి కూడా అదృష్టవశాత్తూ చంద్రిగాడితాలూకా స్థలంలోనే దొరికింది. అతను రోజూ రాత్రిళ్ళు దానిమీద కాళ్ళు బారజాపి పడుకుని కులాసాగా బీడీలు కాల్చుకుంటూ ఉండేవాడు ఇదివరకు.

మంచి శిల్పిని పిలిపించి, విగ్రహం చెక్కమని పురమాయించారు.

ఈలోగా గుడి ఓ ఆకారానికి రాగానే, చుట్టూ ప్రాకారం కట్టించేశారు

అప్పుడు తలెత్తింది అసలు సమస్య!

ప్రాకారం పూర్తయాక, ఊరిపెద్దలూ, పురోహితుడూ, అందరూ కూడబలుక్కుని 'శాస్త్రప్రకారం' ఇంక చంద్రిగాడు ప్రాకారం దాటిరాకూడదనీ, వస్తే గుడి అపవిత్రమైపోతుందనీ, కనక అతన్ని ఇంక పన్లోకి రానివ్వకూడదనీ తేల్చారు.

"అదేమిటీ!" అని నిర్ఘాంతపోయాడు వెంకటేశ్వర్లు. "అతను ఎక్కి తొక్కిన బండ విగ్రహానికి పనికివచ్చినప్పుడు, ఇప్పుడు అతను పనికిరాకూడదనీ, వస్తే గుడి మైలపడిపోతుందనీ అనడం ఏం సబబు?" అన్నాడు, చంద్రిగాడి తరపున కూడా తనే బాధపడిపోతూ. అతనికి తన

పక్షంనుంచేగాక ఎదుటివాడి దృక్పథం నుంచీ కూడా ఆలోచించే 'బలహీనత' ఉంది.

"తవరి బొంద! తవరికేం తెలీదు! తవరు నోర్మూసుకోండి!" అని సమర్యాదగానే కూకలేశాడు ఆశ్రితుడొకడు.

మొత్తం మీద చంద్రిగాడికి పనిలో నుంచీ ఉద్వాసన చెప్పించారు

"వెళ్ళొస్తానయ్యగారూ!" అన్నాడు చంద్రిగాడు, వెంకటేశ్వర్లు ముందర చేతులు కట్టుకునిలబడి.

వెంకటేశ్వర్లు ఒక్క క్షణం ఆలోచించి, లోపలికెళ్ళి, నాలుగు నోట్లు తెచ్చి చంద్రిగాడి చేతిలో పెట్టాడు.

"ఏంటయ్యగారూ ఇది?" అన్నాడు చంద్రిగాడు, ఆశ్చర్యం..

"ఏంలేదు చంద్రయ్యా! గుడి పూర్తవడానికి ఇంకో రెండు నెలలు పడుతుందేమో! అప్పటిదాకా నువ్వు పన్లోకి వచ్చినట్లే లెఖ్ఖేసుకొని, కూలీ ఇచ్చేస్తున్నాను. తీసుకో!" అన్నాడు.

ఒకవైపు అవమానభారంగా, మరో వైపు కృతజ్ఞతతో చంద్రిగాడి గొంతు పూడుకుపోయింది రెండు చేతులూ జోడించి, దణ్ణం పెట్టి వెళ్ళిపోయాడు.

గుడి నిర్మాణం పూర్తయే సమయానికి, కొన్ని సంఘటనలు జరిగి, విగ్రహ ప్రతిష్టాపన మాత్రం జరక్కుండా ఆగిపోయింది.

దానికి వెంకటేశ్వర్లు తాలూకా నిలకడలేనితనమే కారణం!

మంచిగా బతకాలి, మందికి సాయం చెయ్యాలి అన్న తపనతో బాటు, వెంకటేశ్వర్లుకి కష్టపడకుండా, సునాయాసంగా చిట్కా మార్గాలలో తన ఆస్థిని పదింతలు చేసేసి కోటీశ్వరుడై పోవాలన్న హుషారు కూడా ఉంది.

అతని ప్రయోగాల ఫలితంగా, ఆస్థి పదింతలు పెరక్కపోగా, కరిగిపోయి, పదింతలు తరిగింది. అయినా అతను తన పద్ధతులు మార్చుకోలేదు.

ఓ సీజన్లో పొగాకు విపరీతమైన ధర పలికింది. జనం అంతా పొలోమని పొగాకు వెంటపడ్డారు. చూస్తూ ఉండగానే కొంతమంది లక్షలు మిగుల్చుకున్నారు.

చూసిచూసి, తీరా పొగాకు గిరాకీ పడిపోతుండగా, అప్పుడు రంగంలోకి దిగాడు వెంకటేశ్వర్లు. లక్షలు రాలేదు సరికదా, లక్షణమైన ఐదెకరాల సుక్షేత్రం అమ్మాల్సి వచ్చింది.

కొన్నాళ్ళ తర్వాత పత్తికి గిరాకీ పెరిగింది పత్తిని నెత్తినెక్కించుకున్నారు మోతుబర్లు అందరూ. పత్తిత్తుల్లా ఉండే వాళ్ళు లక్షలలో ఊరిపోయి, మాది బస్తాల్లా లావెక్కిపోయారు.

సరిగ్గా పత్తి మార్కెట్టు తాలూకు ఒత్తి కొడిగట్టే సమయంలో అందులోకి దూకాడు వెంకటేశ్వర్లు, మొహం పగిలి, కాళ్ళూ చేతులూ దోక్కుపోయి, ఆ

గాయాలకు అతికించుకోవడానికి మాత్రం పనికి వచ్చింది పత్తి. మరో నాలుగు లక్షలు వదిలాయి.

అలాగే మరొకటీ, మరొకటీ!

అతనికి రేలెత్తుగా తోచిన వ్యాపారం సినిమా!

పక్కవీధి ఉమామహేశ్వరరావుగారి రెండో అబ్బాయి సాంబశివరావు మెద్రాసులో సెటిలయిపోయి, నాలుగు హిట్ సినిమాలు తీశాడు. మొన్న ఏదో అవుట్‌డోర్ షూటింగ్‌కి తన యూనిట్‌తో సహా ఊళ్లోకి వచ్చినప్పుడు వెంకటేశ్వర్లు అతనితో మాట్లాడటం తటస్థించింది.

తను 'పెద్దవాడై'పోయినా, పెద్దల పట్ల గౌరవం ప్రకటించడం మానలేదు సాంబశివరావు. షూటింగ్ చూడటానికి వచ్చిన వెంకటేశ్వర్లుకి కుర్చీ చూపించి, మర్యాదచేసి, కలివిడిగా మాట్లాడాడు. "సినీఫీల్డు మహా విచిత్రమైనది బాబాయ్!" అంటూ మొదలెట్టి, దాన్లో ఎన్ని తమాషాలు జరుగుతాయో, అసలు కథా, ప్లాటూ లేకుండానే, నాలుగు పాటలూ, నాలుగు వేడివేడి డట్లూ, నాలుగు ఫైట్లూ పెట్టి 'లాగించేసిన' సినిమాలని జనం ఎలా విరగబడి చూస్తారో, యాక్షనూ, మ్యూజిక్కూ, జోకులతో సహా చెప్పి అందరినీ నవ్వించాడు సాంబశివరావు.

అప్పుడు వచ్చింది వెంకటేశ్వర్లుకి—సినిమా ఆలోచన!

ఇంత అడ్డంగా వికటంగా తీసిన సినిమాలకే లక్షలు కురుస్తుంటే, తను మంచి కళాఖండం ఒకటి నిర్మించి కోట్లు ఎందుకు సంపాదించగూడదూ?

ఈ సాంబశివుడు తీసిన నాలుగు సిన్మాలూ తను చూశాడు. ఏమీలేదు, ఉత్త మసాలా తప్ప! అవి చూస్తుంటే నిజానికి తనకి తలనొప్పి కూడా వచ్చింది. ఇలాంటి చెత్త సినిమాలు తప్ప మరోటి గతిలేని ప్రేక్షకులమీద జాలి కూడా కలిగింది.

విధిలేక చూస్తున్నారు జనం ఇలాంటి 'చిత్రాలని'! తను అలా కాక్కాదు. మంచి సందేశం, నీతి ఉన్న సినిమా తీస్తాడు. అందులో రెండర్థాల పాటలూ, దోకొచ్చే జోకులూ ఉండవు. సకుటుంబసమేతంగా అందరూ చూడడానికి వీలుగా నీటుగా, ఉంటుంది.

ఈ పంథాలో ఆలోచించి, హరిజనోద్ధరణ సబ్జెక్టుపైన, ఒక బ్రహ్మాండమైన పిక్చరు ప్లాన్‌చేశాడు వెంకటేశ్వర్లు. 'శుభస్య శీఘ్రం' అనుకుని, ఓ అయిదు ఎకరాలు ఆయనవాడికి అమ్మేసి, పట్నం తరలి వెళ్ళిపోయాడు.

తీరా మెద్రాసెళ్ళాక తెలిసిందేమిటంటే కథలో హీరోయిన్‌కి కొంచెం ప్రాధాన్యత ఎక్కువ కావడం. అందుచేత పెద్ద హీరో లెవరూ ఒప్పుకోరని చెప్పారు. అప్పుడు రాత్రికి రాత్రి హీరోయిన్ పాత్రని కుదించి, ఒక రెండవ శ్రేణి హీరోని బుక్‌చేయించాడు డైరెక్టరు.

'సిల్క్ స్మిత' డాన్సు ఒకటి ఉంటే గానీ బిజినెస్ కాదని డైరెక్టుగా చెప్పేశాడు డైరెక్టరు తాలూకా సత్రకాయ ఒకడు.

" 'నైలెక్స్ నళిని' కొత్తగా వస్తోంది ఫీల్డులోకి. ఇద్దర్నీ కలిపి డాన్సు కాంపిటీషను పెడితే నా సామిరంగా ..." అని వంతపాడాడు, ఎవరి తాలూకా వాడో ఆమాకే తెలియని మరో మనిషి.

మొత్తానికి పాటల రికార్డింగ్ అయింది.

ఈ లోపల మరో వెంచర్ మొదలెట్టాడు వెంకటేశ్వర్లు. అతనేం చేసినా ఉధృతంగా చేస్తాడు. 'పాపం! చిన్నపిల్లలకి బాలల చిత్రాలు కరువైపోయాయి!" అని బాధపడిపోయి ఒక 'బాలానందం' టైపు సినిమా, తెలుగు తమిళభాషల్లో ఒకేసారి మొదలెట్టాడు.

మూడు సినిమాలూ సగం 'పూర్తి' అయి, ఆగిపోయాయి...

ఆఖరి ఎకరం అమ్మేసిన వెంకటేశ్వర్లు చేతులు జాపేశాడు— 'ఇంక నా తరం కాదు' అంటూ.

అప్పుడు ఒక సినీ మిత్రుడు వచ్చి, 'నువ్వు బెంగపడకు, నేను సినిమా పూర్తి చేస్తా'నని చెప్పి, 'హరిజనోద్ధరణ' సినిమా తాలూకా రైట్సు మాత్రం రాయించుకుని, షూటింగ్ పునఃప్రారంభించాడు. తెలివిగలవాడవడంవల్ల బాలల చిత్రాన్ని అతను పట్టకారుతో కూడా ముట్టుకోలేదు.

ఎలాగైతేనేం, చివరికి హరిజనోద్ధరణ సినిమా రిలీజయింది.

'భూస్వామి పేదరాలిని చెరచుట' అనే రేప్‌సీన్ కూడా కలిపారు దానికి. రెండు డ్యూయెట్లూ, రెండు డాన్సులూ కూడా ఉన్నాయి దాన్లో, లేనిదల్లా టైటిల్సులో వెంకటేశ్వర్లు పేరు మాత్రమే!

చిత్రంగా, ఆ చిత్రానికి ఓ అవార్డు కూడా వచ్చింది.

హతాశుడైపోయాడు వెంకటేశ్వర్లు.

ఈలోగా, లోగడ బాలల చిత్రానికి గానూ తీసుకున్న అప్పు తీర్చమని నోటీసు వచ్చింది.

అప్పుడు హఠాత్తుగా గ్రహించాడు వెంకటేశ్వర్లు— తను బీదవాడినైపోయానని.

అతను మద్రాసులో మూడేళ్ళపాటు ఇలా కిందామీదా పడుతున్న కాలంలో—

వాళ్ళ ఊళ్ళో పంచాయితీ ఎలక్షన్లు వచ్చాయి. పెద్దలకు పెద్దలకూ పడక, పెద్ద రభసఅయి, రాజీగా మొద్దులాంటి చంద్రంగాణ్ణి లెక్షనుకి నిలిపారు అందరూ. అవును మరి! వాడైతే చెప్పుచేతల్లో ఉంటాడు. తాము ఎదురైతే చెప్పులు చేతుల్లోకి తీసుకుని, దారి తొలిగేటంత వినయ "సంపన్నుడు."

దాంతో పాటు, పనిలోపనిగా హరిజనోద్ధరణా చేసినట్లుంది.

అందుకని అందరూ దువ్వి, బుజ్జగించి,

చంద్రిగాణ్ణి నిలబెట్టి కుర్చీలో కూర్చోబెట్టారు.

అది మొదలు!

అదేమి చిత్రమో, ఓసారి కుర్చీ ఎక్కాక ఇంక చంద్రిగాణ్ణి దించడం బ్రహ్మప్రళయమైపోయింది. రకరకాల పరిస్థితులు కలిసివచ్చి, అతను ట్రిక్ ఫొటోగ్రఫీలోనాగా "జై భేతాళా!" అన్నట్లు తాటిచెట్టంత ఎత్తుకు ఎదిగిపోయాడు. చంద్రిగాడు కాస్తా చంద్రయ్య అయ్యాడు. 'అదేమిట'ని ఆశ్చర్యపడే లోగా చంద్రారావు అయ్యాడు. పొందూరు ఖద్దరు కట్టడం నేర్చుకున్నాడు. జిల్లా పరిషత్తుకి ఎన్నికయ్యాడు. ఎమ్మెల్యే అయ్యాడు.

చూస్తుండగానే మంత్రి కూడా అయ్యాడు.

ఓడలు బళ్ళయాయి. బళ్ళు ఓడలయ్యాయి.

జీవితంలో ఓడిపోయి, దాదాపు చిప్ప చేతిలో పట్టుకున్న స్థితిలో వెంకటేశ్వర్లూ, చెప్పలేనంత వైభవంతో వెలిగిపోతూ చంద్రారావూ ఒకేసారి స్వగ్రామానికి తిరిగి వచ్చారు.

మినిస్టరుగారు చంద్రారావుని మేళతాళాలతో ఊరేగిస్తూ ఊళ్ళోకి తీసుకుపోయారు. పెద్దపెద్ద భూస్వాములు అతన్ని మందుకి, విందుకి పిలవాలని ముందుకు వచ్చారు.

వెంకటేశ్వర్లుని పట్టించుకున్నవాడే లేడు. పలకరించిన ఒక్క ఆసామీ కూడా, "ఏంహాయ్ వెంకటేశం! మొహం వేళ్ళాడేశావ్? సినిమా మోజు తీరిందా?" అన్నాడు గిరీశాన్ని ఇమిటేట్ చేసి అపహాస్యమూ, అసహ్యమూ ఒలికిస్తూ.

ముడుచుకుపోయాడు వెంకటేశ్వర్లు.

మంత్రిగారు ఆ ఊరు రావడానికి కారణం ఉంది. ఆయన్ని పిలిపించి, పొగడ్తలతో ముంచి, దండాలు పెట్టి దండలెయ్యడానికి ఏం సాకు దొరుకుతుందా అని తల్లక్రిందులుగా తపస్సు చేస్తున్న ఊరి పెద్దమనుషులకి, ఉన్నట్లుండి గుర్తొచ్చింది — నిర్మాణం పూర్తయినా, విగ్రహ ప్రతిష్ఠ కాని దేవాలయం.

ఆఘమేఘాల మీద విగ్రహ ప్రతిష్ఠాపన ముహూర్తం నిర్ణయించి, మినిస్టరుగారి పియ్యేగారి కాళ్ళా, గెడ్డం పట్టుకు బతిమాలి, ఆయన్ని సమ్మతింపజేశారు.

గుడిని మొగలెట్టిన రోజుల్లో దాతగా, ప్రస్తుతం చేతగానివాడుగా, చెలామణీ అవుతున్న వెంకటేశ్వర్లుకి పిలుపు కూడా పోలేదు. అయినా, మంత్రిగారి పేరు మీదుగా అక్కడ అన్నదానం జరుగుతోందని తెలిసి అతనే వచ్చాడు.

ఆకలి మహాచెడ్డది! అతను భోజనం చేసి, అప్పటికి రెండు రోజులు దాటింది. అతని భార్యాపిల్లలూ కూడా వచ్చారు అతనితో.

వెంకటేశ్వర్లుగారనీ, నేను పనిలోకి రాకూడదని- పంక్తిమాట అటుంచండి- చివరికి పనిలోకి కూడా రాకూడదని పెద్దలు అడ్డంపెట్టినప్పుడు, నాకు అన్నం పెట్టి, చెయ్యని పనికి సైతం కూలీ ఇచ్చింది కూడా వెంకటేశ్వర్లుగారేననీ నాకు బాగా గుర్తుంది. ఇవాళ ఈ ఉత్సవంలో ముఖ్య అతిథిగా ఉండడానికి అసలు ఎవరికైనా అర్హత అంటూ ఉంటే అది వెంకటేశ్వర్లుగారికే! కానీ ఆయన్ని వెనక్కి నెట్టేసి, మనం ముందు కూర్చున్నాం.

దీనికంతా కారణం ఏమిటీ అని ఆలోచిస్తే ఒకటే తడుతుంది.

డబ్బు- దానితో వచ్చే అధికారం!

అధికారం- దానితో వచ్చే డబ్బు!

అంతే!

డబ్బున్న రోజున వెంకటేశ్వర్లుగారు పురుషోత్తముడు! అపర దానకర్ణుడు! చేతికి ఎముకలేని వాడు.

అదే వెంకటేశ్వర్లు డబ్బులేని రోజున ఉత్త పనికిమాలినవాడు! అప్రయోజకుడు!

ఒకప్పుడు కాలితో తాకడానికి కూడా మీకు పనికిరాని చంద్రిగాడు ఇవాళ పదవీ డబ్బూ రాగానే ఇంద్రుడు, చంద్రుడు, దేముడు!

అంచేత తెలుస్తోందేమిటంటే, మీకు డబ్బే దేముడు! ఈ గుళ్ళో అసలు ఏ విగ్రహమూ అక్కర్లేదు. రెండు లంకె బిందెలనిండా కాసులు పోసి, దానికి నిత్య ధూపదీపనైవేద్యాలు జరిపించండి చాలు! ఛా!"

అయితే ఈ మాటలన్నీ పైకి అనలేదు చంద్రారావు. మనసులో మెదిలిన భావాలన్నీ ఎప్పటికప్పుడు బయట పెట్టేస్తూ ఉంటే, అసలు అతను అంత పెద్ద రాజకీయ నాయకుడయ్యేవాడు కాదు.

అవివేకంగా, వెంకటేశ్వర్లుని పొగిడి, పెద్దలను తెగిడి, తన ఓట్ల బ్యాంకుని నాశనంచేసుకునే మూర్ఖుడుకానేకాదతను.

అందువల్ల మనసు భుగభుగలాడుతున్నా, పైకి మాత్రం చల్లటి చిరుమందహాసంతోనే తంతు అంతా ముగించాడు. తర్వాత 'మన పూజ్య బాపూజీ'తో మొదలెట్టి, స్వాతంత్ర్యం, సామ్యవాదం, కులమత రహిత సమాజం, నిస్వార్థసేవా, అవిరళకృషిలాంటి ఊతపదాలతో ఊకదంపుడు సందేశం అందజేసి, అందరికీ పొడుగుపాటి నమస్కారం పెట్టి, అంతకంటే పొడుగుపాటి కార్లో ఎక్కుతూ-

ఒక్కసారి వెనక్కి తిరిగి, వెంకటేశ్వర్లు మొహంలోకి నేరస్థుడిలా చూశాడు చంద్రారావు.

ఆ చూపులో, 'నన్ను క్షమించండి!" అన్న వేడికోలు ఉంది

క్షమించడానికి అసలు తప్పేమీలేదు!

అతనూ అందరిలాంటి మనిషే మరి!